بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 26 December 2025 (Telugu)

# దైవ (అల్లాహ్) ప్రేమ నేపథ్యంలో మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవిత విశ్వాసభరిత ఆసక్తికర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 26.12.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రే) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰہِ رَبِّ الۡعٰلَمِیۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ ○ مٰلِکِ یَوۡمِ الدِّیۡنِ ○ اِیَّاکَ نَعۡبُدُ وَ اِیَّاکَ نَسۡتَعِیۡنُ ○ اِہۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِیۡمَ ○ صِرَاطَ الَّذِیۡنَ اَنۡعَمۡتَ عَلَیۡہِمۡ غَیۡرِ الۡمَغۡضُوۡبِ عَلَیۡہِمۡ وَ لَا الضَّآلِّیۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

గత ఖుత్బాలో నేను మహనీయ హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి జీవిత చరిత్రకు సంబంధించిన కొన్ని విషయాలను తెలిపాను. ఈ రోజు అల్లాహ్ పట్ల ప్రేమానురాగాలకు సంబంధించి ఆయన (స.అ.వ.) జీవిత చరిత్రలోని కొన్ని అంశాలను వివరిస్తాను. మహనీయ హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి జీవిత చరిత్రలోని ఈ అంశం ద్వారా అల్లాహ్‌కు ఆయనపై ఉన్న ప్రేమ కూడా వ్యక్తమవుతుందని మనం చూస్తున్నాం. కేవలం ఆయనకు మాత్రమే అల్లాహ్‌పై ప్రేమ లేదు, అల్లాహ్‌కు కూడా ఆయన (స.అ.వ.) పై ప్రేమ ఉంది. ఈ ప్రేమ ప్రకటన తర్వాత అల్లాహ్ ఆయన (స.అ.వ) కు మార్గదర్శకత్వం వహించాడు, ఆ ప్రేమలో మరింత వృద్ధి చెందుతూ ఆయన తన ఉమ్మత్ (సమాజం) నకు ఏ విధంగా శిక్షణ, మార్గదర్శకత్వం ఇచ్చారో మనం చూస్తాము. అల్లాహ్‌కు ఆయన (స.అ.వ) పై ఉన్న ప్రేమ, ఆయనకు అల్లాహ్ పై ఉన్న ప్రేమకు సంబంధించిన ఈ వ్యక్తతను మనం వివిధ కథనాలలో చూస్తాము. ఎవరైనా సరే చేరుకోలేని ఉన్నత స్థాయి వారిది. అనగా అటువంటి పరిపూర్ణ మానవుడు ఆయనే (స.అ.వ). అవును! మీ కొరకు ఒక ఉత్తమ ఆదర్శం ఉందని, వారిని అనుసరించడానికి ప్రయత్నించండి అని అల్లాహ్ ఆదేశించాడు. అందుకే అల్లాహ్ ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా ఈ ప్రకటన చేయించాడు. ఓ ప్రజలారా! మీరు అల్లాహ్‌ను ప్రేమిస్తున్నట్లయితే నన్ను అనుసరించండి, అప్పుడు అతడు కూడా మిమ్మల్ని ప్రేమిస్తాడు మరియు మీ తప్పులను క్షమిస్తాడని వారికి చెప్పు. అల్లాహ్ మిక్కిలి క్షమించేవాడు మరియు పదేపదే కరుణించేవాడు. కావున అల్లాహ్ ప్రేమను పొందే మార్గాలను కూడా ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శం నుండే నేర్చుకోవాలి.

హుజూరె అన్వర్ ఇలా ప్రవచించారు: అల్లాహ్ పట్ల ఆయన (స.అ.వ.)కు ఉన్న ప్రేమకు సంబంధించిన దృశ్యాలు మనకు కనిపిస్తాయి. హదీసులలో ఇటువంటి కథనాలు ఉన్నాయి: ఆయన (స.అ.వ.) అల్లాహ్ నుండి ప్రేమను కోరుతూ ఆయన (స.అ.వ.) ఈ విధంగా దుఆ చేసేవారు: ఓ

అల్లాహ్! నేను నీ నుండి నీ ప్రేమను, నిన్ను ప్రేమించే వారి ప్రేమను మరియు నిన్ను ప్రేమించేలా చేసే అటువంటి కార్యాలను చేసే అనుగ్రహాన్ని కోరుతున్నాను. ఓ అల్లాహ్! నీ ప్రేమను నా ప్రాణం కంటే, నా కుటుంబం కంటే మరియు చల్లని నీటి కంటే ఎక్కువ ప్రియమైనదిగా చేయి. కావున ఎవరైతే మహనీయ హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారిని ప్రేమిస్తున్నామని చెప్పుకుంటారో మరియు అల్లాహ్ పట్ల ప్రేమను వ్యక్తం చేసి ఆయనకు ప్రియమైన వారిగా మారి అల్లాహ్ అనుగ్రహాన్ని పొందాలనుకుంటారో అటువంటి ప్రతి వ్యక్తి ఈ దుఆ చేయవలెను.

అల్లాహ్ పట్ల ప్రేమకు సంబంధించిన ఒక సంఘటనను హజ్రత్ ఆయిషా (రజి) ఇలా వివరించారు: ఒక రాత్రి అల్లాహ్ ప్రవక్త స.అ.వ సజ్దా (సాష్టాంగం)లో ఉండి ఈ దుఆ చేయడాన్ని నేను విన్నాను: 'నేను నీ కోపం నుండి నీ ప్రసన్నత వైపు శరణు కోరుతున్నాను, నీ శిక్ష నుండి నీ క్షమాగుణం వైపు శరణు కోరుతున్నాను, నీ ప్రశంసలను నేను లెక్కించలేను'. 'నీవు నీ గురించి ఏ విధంగా ప్రశంసించు కున్నావో నీవు అలాగే ఉన్నావు'. ఇదేవిధంగా హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలిపారు: ఒక రాత్రి ఆయన ఇలా అనడం విన్నాను: 'నా శరీరం, ఆత్మ నీకే సజ్దా (సాష్టాంగం) చేస్తున్నాయి, నా హృదయం నీపై విశ్వాసం కలిగి ఉన్నది, ఓ నా అల్లాహ్!. ఇవి నా రెండు చేతులు, ఇవి నీ ముందు చాచి ఉన్నాయి మరియు నేను నా ఆత్మపై చేసుకున్న అన్యాయమంతా నీ ముందు ఉంది. ఎవరి నుండి అయితే ప్రతి పెద్ద విషయం ఆశించబడుతుందో, ఓ అత్యున్నతమైన వాడా! నీవు నా పెద్ద పాపాలను క్షమించు'. ఆపై ఆయన (స.అ.వ.) హజ్రత్ ఆయిషా (రజి) అన్‌హాతో ఇలా అన్నారు: 'విషయం ఏమిటంటే జిబ్రయిల్ నా వద్దకు వచ్చి ఈ పదాలను చదవమని చెప్పారు'. కనుక నీవు కూడా నీ సజ్దాలలో వీటిని చదువుతూ ఉండు. ఎవరైతే ఈ పదాలను చదువుతారో వారు సజ్దా నుండి తల ఎత్తక ముందే క్షమించ బడతారు'. మరొక కథనం ప్రకారం జిబ్రయిల్ ఇలా అన్నారు: 'మీ ప్రభువు మిమ్మల్ని బఖీ ఖబ్రిస్తాన్‌లోని సమాధుల వద్దకు వెళ్లి వారి కోసం క్షమాపణ వేడుకోమని ఆజ్ఞాపిస్తున్నాడు'. 'నేను కూడా ఈ పుణ్యంలో పాలుపంచు కోవచ్చా? నేను కూడా ఇప్పుడే అక్కడి నుండి వచ్చాను, నేను ఏ దుఆ చేయాలి?' అని హజ్రత్ ఆయిషా (రజి) అడిగారు. 'విశ్వాసులు మరియు ముస్లింలైన ఈ గృహస్థులపై శాంతి కలుగుగాక. అల్లాహ్ మనలో ముందుగా వెళ్ళిన వారిపై మరియు తర్వాత వెళ్ళే వారిపై కరుణ కురిపించుగాక, అల్లాహ్ కోరినట్లయితే మేము కూడా మీతో వచ్చి కలుస్తాము' అని చెప్పు అని ఆయన (స.అ.వ.) ఆజ్ఞాపించారు.

హజ్రత్ ఇబ్న్ ఉమర్ (రజి) హజ్రత్ ఆయిషా (రజి)ని ఇలా అడిగారు: 'అల్లాహ్ ప్రవక్త (స.అ.వ.)లో మీరు చూసిన అత్యంత ప్రియమైన మరియు అద్భుతమైన విషయం నాకు తెలపండి?'. ఇది వినగానే హజ్రత్ ఆయిషా (రజి) ఏడ్చి ఇలా అన్నారు: 'ఆయన (స.అ.వ.) ప్రతి విషయం కూడా ప్రియమైనది మరియు అద్భుతమైనదే'. తర్వాత హజ్రత్ ఆయిషా (రజి) ఇలా వివరించారు: ఒకసారి ఆయన నా వంతు రాత్రి నా వద్దకు వచ్చారు. నేను ఆయన శరీరాన్ని తాకినప్పుడు ఆయన ఇలా అన్నారు: 'ఓ ఆయిషా! నీవు నాకు అనుమతినిస్తే, ఈ రాత్రి మిగిలిన సమయమంతా నా ప్రభువు ఆరాధనలో

గడుపుతాను'. 'నాకు మీ సామీప్యం మరియు మీ కోరిక రెండూ ఇష్టమే' అని నేను విన్నవించాను. ఆయన వుజూ చేసిన తర్వాత నిలబడి పవిత్ర ఖుర్ఆన్ చదవడం, ఏడవడం ప్రారంభించారు, ఆయన (స.అ.వ.) కన్నీళ్లు ఆయన దుస్తుల వరకు చేరడాన్ని నేను చూశాను. ఆ తర్వాత ఆయన (స.అ.వ.) తన కుడి వైపుకు ఒరిగి కుడి చేతిని చెంప కింద పెట్టుకొని మళ్ళీ ఏడవడం ప్రారంభించారు. కన్నీళ్లు నేల వరకు చేరడం నేను చూశాను. అప్పుడు హజ్రత్ బిలాల్ (రజి) ఫజ్ర్ నమాజ్ సమాచారం ఇవ్వడానికి వచ్చారు. ఆయన ఏడవడాన్ని చూసి 'ఓ అల్లాహ్ ప్రవక్త!. అల్లాహ్ మీ గత, రాబోయే పాపాలన్నింటినీ క్షమించి వేసినప్పటికీ మీరు ఎందుకు ఏడుస్తున్నారు?' అని అడిగారు. 'నేను కృతజ్ఞత కలిగిన దాసునిగా మారకూడదా!' అని ఆయన బదులిచ్చారు. మహనీయ హజ్రత్ ముహమ్మద్ (స.అ.వ.) గారి జీవితమంతా దైవ ప్రేమలో మునిగి ఉండేది. దైవ ప్రేమకు సంబంధించిన ఈ దృశ్యాలను చూసి మక్కా ప్రజలు إِنَّ مُحَمَّدًا عَشِقَ رَبَّهُ అనగా ముహమ్మద్ తన ప్రభువుపై ప్రేమలో పడిపోయారని అనేవారు.

హుజూరె అన్వర్ ఇలా బదులిచ్చారు. మహనీయ హజ్రత్ ముహమ్మద్ (స.అ.వ.) గారి ఆదర్శం మరియు అల్లాహ్ ప్రేమకు సంబంధించిన ఈ పద్ధతిలో కొన్ని ఉదాహరణలు నేను సమర్పించాను. ఈ పద్ధతి ప్రభావం వల్లనే అనుచరులలో ఒక విప్లవం వచ్చి వారు ఇంతకుముందు ఊహించని స్థాయిని పొందారు. ఇదే పరిపూర్ణమైన శిక్షణ. దీన్నే ఆయన (స.అ.వ.) నిజమైన దాసుడైన హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం కూడా అనుసరించారు. మహనీయ హజ్రత్ ముహమ్మద్ (స.అ.వ.) గారిని సంపూర్ణంగా అనుసరించడం వల్లనే అల్లాహ్ తనకు కూడా అనుగ్రహాలు ప్రసాదించాడని ఆయన (స.అ.వ.) ఒక చోట పేర్కొన్నారు. మనం మహనీయ హజ్రత్ ముహమ్మద్ (స.అ.వ.) గారి నిజమైన అనుచరులమని మరియు ఆయన నిజమైన దాసుని చేతిపై బైఅత్ చేసి మా జీవితాలను అల్లాహ్ ఆజ్ఞల ప్రకారం మలుచుకోవడానికి ప్రయత్నిస్తామని ఈనాడు మనం వాగ్దానం చేస్తున్నాము. కాబట్టి మనం చేసే ప్రతి పనిని కేవలం అల్లాహ్ కోసమే చేయాలని, ఆయన ప్రేమలో ముందుకు సాగడానికి ప్రయత్నించాలని మనం దీనిపై దృష్టి పెట్ట వలెను. అల్లాహ్ మనకు ఆ అనుగ్రహాన్ని ప్రసాదించుగాక.

హుజూరె అన్వర్ ఇలా ప్రవచించారు: పాకిస్తాన్ అహ్మదీయుల కోసం ఈ రోజుల్లో దుఆ చేయండి. అక్కడ ముబారక్ సాని గారిపై పవిత్ర ఖుర్ఆన్ తన దగ్గర ఉంచుకోవడం, చదవడం, నేర్పించడం వంటి ఆరోపణల పేరున ఒక కేసు (వాజ్యం) నడుస్తుండెను. వారికి సెషన్స్ జడ్జి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. అల్లాహ్ వారిని (వ్యతిరేకులను) త్వరగా శిక్షించడానికి మార్గాలు సుగమం చేయాలని మనం దుఆ చేస్తున్నాము. అల్లాహ్ శిక్ష త్వరలోనే వారిపై పడును. ఇన్షా అల్లాహ్. దాని సంకేతాలు కూడా కనిపిస్తున్నాయి. అయితే మన దుఆలలో లోపం వల్ల లేదా ఆరాధనల హక్కులను సరిగ్గా నెర వేర్చకపోవడం వల్ల ఇందులో జాప్యం జరగకూడదు అనే ఆందోళన మనకు కలుగవలెను. మహనీయ హజ్రత్ ముహమ్మద్ (స.అ.వ.) కూడా అప్పుడప్పుడు మేఘాలను చూసి ఈ భయంతో దుఆ చేసేవారు. కావున దుఆల వైపు చాలా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇదేవిధంగా మిగతా ప్రపంచంలోని

బాధితుల కోసం కూడా దుఆ చేయండి. అల్లాహ్ ప్రతిచోటా ప్రతి ఒక్కరికీ శాంతిని ప్రసాదించుగాక మరియు ప్రతి అల్లరి, పీడనముల నుండి కాపాడుగాక.

చివరగా హుజూరె అన్వర్ ఇద్దరు మృతుల గురించి ప్రస్తావించారు. మొదటి వారు ఖాదియాన్ కు చెందిన సదర్ అన్‌జుమన్ అహ్మదియ్య మాజీ సదర్ మరియు మాజీ సదర్ మజ్లిస్ తహ్రీక్-ఎ-జదీద్ గౌరవనీయ మౌలానా జలాలుద్దీన్ నయ్యర్ గారు. వీరి తండ్రి గౌరవనీయ ఎచ్ హుస్సేన్ గారు (కేరళ) 1922లో అహ్మదియ్య సంఘాన్ని స్వీకరించారు. ఆయన జమాఅత్ పత్రిక 'సత్యదూతన్'కు ఎడిటర్‌గా నియమితులయ్యారు. 1950లో ఖాదియాన్ జనాభా కోసం హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఇచ్చిన పిలుపు మేరకు తన కుటుంబంతో సహా ఖాదియాన్ వచ్చి అక్కడే స్థిరపడ్డారు. కానీ ఒక ఏడాది లోపే ఖాదియాన్‌లో ఆయన మరణించారు. నయ్యర్ గారి తల్లి గౌరవనీయ జుబైదా సుల్తానా గారు ఆ తర్వాత ఖాదియాన్ దర్వేష్ చౌదరి అబ్దుల్ హక్ గారిని రెండవ వివాహం చేసుకున్నారు. జలాలుద్దీన్ నయ్యర్ గారి ప్రాథమిక విద్య ఖాదియాన్‌లోనే జరిగింది. 1963 సం॥లో ఆయన మౌల్వీ ఫాజిల్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. వీరు బైతుల్ మాల్ ఇన్స్‌పెక్టర్‌గా సుదీర్ఘ కాలం వరకు సేవలు అందించారు. దీనివల్ల భారతదేశం అంతటా ఉన్న జమాఅత్ సభ్యులతో ఆయనకు వ్యక్తిగత సంబంధాలు ఉండేవి. మృతుడు అరవై మూడు ఏళ్ల పాటు జమాఅత్ సేవ చేసే భాగ్యాన్ని పొందారు. ఈ కాలంలో ఆడిటర్‌గా, అకౌంటెంట్ గా మరియు సుదీర్ఘ కాలం నాజిర్ బైతుల్ మాల్ ఆమద్‌గా సేవ చేసే అవకాశం లభించింది. ఏడు సంవత్సరాల పాటు ఖాదియాన్ సదర్ అన్‌జుమన్ అహ్మదియ్యకు సదర్‌గా కూడా పనిచేశారు. ఆరోగ్యం సహకరించినంత కాలం సదర్ మజ్లిస్ తహ్రీక్-ఎ-జదీద్‌గా కూడా ఉన్నారు. ఇదేవిధంగా అనుబంధ సంస్థలలో కూడా సేవ చేసే అనుగ్రహం లభించింది. ఆయన ఆరాధనలు చేసేవారు, నమాజ్, ఉపవాసాలను పాటించేవారు. ప్రస్తుత ఖిలాఫత్ ప్రతి మాటను శిరసావహించే వారిలో అగ్రగణ్యులుగా ఉండేవారు. ఆయన ఒక అథ్లెట్ కూడా. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు, వీరు జమాఅత్ సేవ చేస్తున్నారు. ఇదేవిధంగా మీర్ ముష్తాక్ అహ్మద్ గారి కుమారుడైన మీర్ హబీబ్ అహ్మద్ గారి ఉత్తమ గుణాలను కూడా వివరించారు. ఈ ఇద్దరు మృతుల పాప క్షమాపణ, ఉన్నత స్థాయిల కోసం దుఆ చేసి పరోక్ష అంత్యక్రియల ప్రార్థన చదివిస్తానని ప్రకటించారు.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا ۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِى الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ ۔